ప్రజాశక్తి
సోమవారం 3 జులై 2023 5
శ్రీ సత్యసాయి



జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం

రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ కరుణసాగర్‌రెడ్డి


కరుణసాగర్‌రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వాహనదారులు రోడ్డు నిబంధనల మేరకు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయి. జిల్లాలో ప్రతి ఒక్క వాహనదారునికి, డ్రైవర్లకు లైసెన్సులు మంజూరు చేసి రోడ్డు ప్రమాదాల జరగకుండా నివారణ చర్యలు చేపడతామని హిందూపురం రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి కరుణ సాగర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తితో ఆదివారం మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేయకపోవడానికి కారణం ఏమిటి?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని గతంలో పుట్టపర్తిలో ఏర్పాటు చేశాం. కానీ కొన్ని అనివార్య కారణాల వలన హిందూపురంలోనే కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం వాహన లైసెన్సులు పొందవలసిన వారు హిందూపురం నుండి పొందుతున్నారు. వాహనదారులు ఎక్కువగా ఉన్న కారణంగా హిందూపురం నుండే కొనసాగిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుట్టపర్తిలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం.

ప్ర: శ్రీ సత్యసాయి జిల్లాలో ఎన్ని వాహనాలు ఉన్నాయి, కాలం చెల్లిన వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లాలో ఆటో రిక్షాలు, గూడ్స్ వాహనాల పాటు ఇతర వాహనాలు మొత్తం 2,77,235 వాహనాలు ఉన్నాయి. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేయలేకపోవటంతో హిందూపురం నుండి కార్యకలాపాలు సాగిస్తున్నాం. వాహన లైసెన్సులు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్లు తదితర ఆన్లైన్ కార్యకలాపాలు ప్రస్తుతం హిందూపురం నుండి కొనసాగిస్తున్నాం. ఇక్కడినుండే అన్ని చెల్లింపులు జరుగుతున్నాయి.



ప్ర : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరక్కుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రజలకు, వాహన యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. 18 సంవత్సరాల లోపు వారు వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటున్నాం. లైసెన్సు లేనివారు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, భారీ వాహనాలు నడపకుండా చర్యలు చేపడుతున్నాం. అలాంటి వారిని ట్రాన్స్‌పోర్టు అధికారులు గుర్తించి వారికి అవగాహన కల్పించి లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. లైసెన్సు మంజూరు చేయడానికి మేళాలు ఏర్పాటు చేసి వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి లైసెన్సులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : బడిబస్సుల కండీషన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : పాత బస్సులను, కాలం చెల్లిన బస్సులను నడిపే పాఠశాలలపై చర్యలు తీసుకుంటున్నాం. అలాంటి బస్సులను లైసెన్స్, పరిమితులు పునరుద్ధరణకు వచ్చినప్పుడు వాటినిపరిశీలించి కండిషన్ సరిగా లేని వాటిని తిరిగి పంపుతున్నాం. వాటి పనితీరును పరిశీలించి పర్మిట్లు మంజూరు చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఏ పాఠశాల వారైనా బస్సులు నడిపితే వారిపై కేసులు పెడతాం. అలాంటి బస్సులను సీజ్ చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రీ సత్య సాయి జిల్లాలో కాలం చెల్లిన బడి బస్సులకు అనుమతులు మంజూరు చేయం.



లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో రైతులకు జరిగిన అన్యాయం అంతా, ఇంతా కాదు. పరిశ్రమ ఏర్పాటు పేరుతో వేలాది ఎకరాలను రైతుల నుంచి బలవంతంగా లాగేసుకున్నారు. తీరా అక్కడ కంపెనీ ఏర్పాటు చేయకుండా రైతుల భూములను బడాపారిశ్రామిక వేత్తలు బ్యాంకుల్లో తాకట్టుపెట్టి కోట్లాది రూపాయలు కాజేశారు. అక్కడితో ఈ అవినీతిబాగోతం ఆగేలా కన్పించడం లేదు. లేపాక్షిహబ్ పేరుతో ఇప్పటికీ పొలాలు లాగేసుకునే కుట్ర జరుగున్నట్లుగానే తెలుస్తోంది. తాజాగా చిలమత్తూరు మండల పరిధిలోని పలు అన్‌సెటిల్డ్ భూములు లేపాక్షి హబ్ పేరుపై ఆన్‌లైన్‌లో మారాయి. వారం రోజుల క్రితం వరకు ఆన్‌లైన్‌లో అన్‌సెటిల్డ్ భూములుగా ఆన్‌లైన్ ఉన్నవి ఇప్పుడు లేపాక్షి హబ్‌పై చూపిస్తున్నాయి. వీటిని చూసిన రైతులు




పక్కాగా ఏ 'మార్చే'శారు..!

◆ లేపాక్షి హబ్ పేరుపై అన్‌సెటిల్డ్ భూములు
◆ వారం రోజుల క్రితం వరకు అన్‌సెటిల్డ్ కిందనే ఆన్‌లైన్‌లో..
◆ రెండు రోజుల్లో 'లేపాక్షి'పై మారిన 1075 ఎకరాలు
◆ లబోదిబోమంటున్న రైతులు
◆ పొంతనలేని సమాధానం ఇస్తున్న అధికారులు
◆ సాంకేతిక లోపమా..? బోగస్ కంపెనీలకు సాయమా..?

ప్రజాశక్తి-చిలమత్తూరు

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చిలమత్తూరు మండలంలో లేపాక్షి హబ్ పేరుతో రైతుల భూములను తీసుకున్నారు. అతరువాత అక్కడ పరిశ్రమ ఏర్పాటు కాలేదు. పరిశ్రమలు ఏర్పాటు చేయని నేపథ్యంలో ఆ భూములను రైతులకు వెనక్కు ఇచ్చేయాలని పెద్ద ఎత్తున సిపిఎం, ఇతర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసనలూ జరిగాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం అన్‌సెటిల్డ్ (వివాదాస్పద) భూములపై పెద్దల కన్ను పడినట్లు తెలుస్తోంది. చిలమత్తూరు మండల పరిధిలో అన్‌సెటిల్డ్ పేరుపై ఆన్‌లైన్‌లో ఉన్న 1075 ఎకరాల భూమి రెండు రోజుల క్రితం లేపాక్షి హబ్‌పై పేరు మార్పిడి జరిగింది. రీసర్వే పేరిట అపరిష్కృత భూములకు పరిష్కారం చూపాల్సిన తరుణంలో ఉన్న భూములను ఇలా కార్పొరేట్ సంస్థ పేరిట మార్పిడి జరగడం వెనుక ఎవరి హస్తం ఉందన్నది



తెలియడం లేదు. అన్నదమ్ముల వివాదాల నేపథ్యంలో కోర్టుల్లో ఉన్న భూములు, పట్టాపాసుపుస్తకం కలిగి పెద్ద అడంగల్, ఆన్‌లైన్ 1బి చేసుకోని భూములు అన్‌సెటిల్డ్‌గా ఆన్‌లైన్‌లో ఉంటాయి. ఈ భూములన్నీ ఖాతా నెంబర్ "123456" గా అపరిష్కృత భూముల జాబితాలో ఉంటాయి. 1-బిలోనూ వీటి వివరాలు అన్‌సెటిల్డ్ అనే చూపిస్తుంటాయి. ఇలాంటి భూమి చిలమత్తూరు రెవెన్యూ పొలంలో సుమారు 1388 సర్వేనెంబర్లలో 1200 ఎకరాలకుపైనే ఉంది. ప్రస్తుతం ఇలాంటి భూముల్లో దాదాపు 1075 ఎకరాలు 1-బిలో లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుపై చూపిస్తోంది. ఇది చూసిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అన్‌సెటిల్డ్ కింద ఉన్న భూముల రికార్డులు ఎలా మారాయంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

సాంకేతిక లోపమా..?
బోగస్ కంపెనీలకు సాయమా..?

అన్‌సెటిల్డ్ కింద ఉన్న భూములు ఒక్కసారిగా లేపాక్షి హబ్ పేరుతో ఆన్‌లైన్‌లో రావడంపై సర్వత్రా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెవెన్యూ అధికారులకు తెలియకుండా, వారి ప్రమేయం లేకుండా 1-బి జాబితాలో పేర్లు మారే అవకాశం లేదు. అలాంటిది ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా వెయ్యి ఎకరాల భూమి ఓ కార్పొరేట్ కంపెనీ పేరుపై రావడం వెనుక పెద్దల హస్తం ఉంటుందనే అనుమానాలు బలంగా ఉన్నాయి. రెవెన్యూ అధికారులు మాత్రం దీనిపై పొంతలేని సమాధానం ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లో సమస్య వల్లనే అలా చూపిస్తున్నాయని, దానిని సరి చేస్తామని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. సాంకేతిక సమస్య ఉంటే అన్‌సెటిల్డ్ పేరుపై ఉన్న భూములు లేపాక్షి హబ్‌కే ఎలా మారుతాయంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రైతులు రెవెన్యూ ముఖ్య అధికారిని అడిగితే ఇంతకాలంగా వివాదాస్పద భూముల సమస్యను మీరెందుకు పరిష్కరించు కోలేదంటూ ఎదురు ప్రశ్న వేయడం గమనార్హం. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులే ఇలా రైతులకు ఎదురు ప్రశ్నలు వేయడం విస్మయానికి గురి చేస్తోంది. అన్‌సెటిల్డ్ భూములు ఆన్‌లైన్‌లో పేరు మార్పు సాంకేతిక లోపమో..? లేక బోగస్ కంపెనీలకు సాయమో..? తెలియని పరిస్థితి నెలకొంది.

ఇది మరో పెద్ద కుట్ర



చిలమత్తూరు మండలంలో వివిధ సమస్యలతో అపరిష్కృతంగా ఉన్న రైతులను భూములను లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములుగా మార్చడం వెనుక పెద్ద కుట్ర ఉంది. హబ్ పేరుతో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన బోగస్ కంపెనీ ఇప్పుడు మరోమారు తన పేరిట సుమారు 1075 ఎకరాలను మార్చేసుకుంది. ఇందులో అధికారులు, పెద్దల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. రైతులు ఏమీ చేయలేరనే ఇలాంటి దారుణానికి ఒడిగట్టారు. ఇందులో వైసిపి ప్రభుత్వ పెద్దల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రీ సర్వేలో ఉన్న వెసులుబాటును ఉపయోగించుకుని ఆ సంస్థతో అధికారులు కుమ్మకై రైతుల భూములను కాజేయాలని కుట్ర చేస్తున్నారు. దీనిని వ్యవసాయ కార్మిక సంఘంగా తాము తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆన్‌లైన్‌లో లేపాక్షి హబ్ పేరును తొలగించి రైతుల పేరిట భూములు మార్చకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం.

ఫిరంగి ప్రవీణ్ కుమార్, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు.

లేపాక్షి హబ్‌పేరుపై చూపిస్తోంది



నాకు సర్వేనెంబర్ 407-14లో 1.18 ఎకరాల భూమి ఉంది. ఇందులో సుమారు 0.78 ఎకరాలు అన్నాదమ్ముల సమస్య కారణంగా ఇంతకాలంగా కోర్టు లో వివాదం నడుస్తోంది. దీంతో భూమికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ అన్‌సెటిల్డ్ జాబితాలో ఉండేది. ఇప్పుడు చూస్తే 1-బిలో లేపాక్షి హబ్ అని వస్తుంది. రెండు రోజుల క్రితం అన్‌సెటిల్డ్‌లో ఉన్న మా భూమి మాకు తెలియకుండా లేపాక్షి హబ్ పేరుకు ఎలా మారిందో అర్థం కాని పరిస్థితి ఉంది.

రామకృష్ణ రెడ్డి, రైతు.

రెండు రోజులక్రితం వరకు అన్‌సెటిల్డ్‌లోనే ఉంది...



నా భూమికి సంబంధించి పాస్ పుస్తకం ఇవ్వమని గత రెండేళ్లుగా నేను అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. ఆన్‌లైన్‌లో అన్‌సెటిల్డ్‌గా చూపుతోందని, దీంతో పాసుస్తుకం ఇవ్వలేమని రెవెన్యూ అధికారులు చెబుతూ వచ్చారు. ఇటీవల మ్యూటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాను. ఇంతలోనే లేపాక్షి హబ్ పేరిట భూమి వివరాలు వస్తున్నాయి. విఆర్వోను అడిగితే ఆ భూములు లేపాక్షి హబ్ పరిధిలోకి వస్తాయంటున్నారు. వారం రోజుల క్రితం వరకు కూడా మా భూమి ఆన్‌లైన్‌లో అన్‌సెటిల్డ్ కిందనే ఉంది.

సురేష్, రైతు.

ఊరిలో సగభాగం మార్చేశారు...



నేను నా పట్టా భూమిలో నిర్మించుకున్న ఇళ్లతో పాటు మా ఊరిలో సగం ఇళ్ల లేపాక్షి హబ్ పేరిట మార్చేశారు. మా సర్వే నెంబర్ 407-1, 407-2, 409-1,409-2 మొత్తం 2 ఎకరాల పట్టా భూమి ఉంది. ప్రస్తుతం దీని వివరాలు అన్నీ ఆన్‌లైన్‌లో లేపాక్షి హబ్ పేరిట మార్చేశారు. ఇదేమని రెవెన్యూ అధికారులను అడిగితే వారు పొంతలేని సమాధానం ఇస్తున్నారు. ఉన్న ఫలంగా ఇలా రికార్డులు ఎలా మారాయన్న దానిపై అధికారులు సమాధానం చెప్పాలి.

గోపాల్ రెడ్డి, తుమ్మలకుంట గ్రామం.

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేద్దాం

మంత్రి ఉషశ్రీ చరణ్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఈ నెల 8వ తేదీన కళ్యాణదుర్గంకి రానున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభలో నియోజకవర్గంలోని ప్రతి వైసిపి నాయకుడు, కార్యకర్త, ప్రజలు పాల్గొని విజయవంతం చేద్దామని మంత్రి ఉషాశ్రీచరణ్ తెలిపారు. ఆదివారం నాడు కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండలాల వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 8న వైఎస్ఆర్ రైతు దినోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్మోన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేస్తారన్నారు. నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కృషి చేయాలని సూచించారు.

సచివాలయ మండల కన్వీనర్‌గా షేక్ ఇమామ్‌వలి

ప్రజాశక్తి - సోమందేపల్లి

మండల జగనన్న సచివాలయ కన్వీనర్(జె సి ఎస్) గా వైసిపి మైనార్టీ నాయకులు షేక్ ఇమామ్ వలిని నియమించారు. ఈ మేరకు తాడేపల్లి వైసిపి కార్యాలయం నుండి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఇమామ్‌వలి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు అటు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి, ఇటు ఎమ్మెల్యే శంకర్ నారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

కార్పొరేట్లకు మేలుచేసే జిపిఎస్ వద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి -పెనుకొండ

కార్పొరేట్లకు మేలు చేసే జిపిఎస్ తమకు వద్దు అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్. జయ చంద్రారెడ్డి, కె.నాగేంద్ర అన్నారు. ఆదివారం పట్టణంలో యుటిఎఫ్ శ్రీసత్య సాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో అత్యవసర జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేకూర్చే జిపిఎస్‌ను అంగీకరించబోమని, ప్రత్యామ్నాయం ఒపిఎస్ మాత్రమేనని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలకు కట్టుబడి ఉండాలన్నారు. ఒపిఎస్‌ను అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణను అమలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని సంక్షోభంలో నెట్టే జీవో నెంబర్117 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీలు 2023 జరిగిన సందర్భంగా ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు, రీఅప్పోర్షన్ ఖాళీలకు సంబంధించిన క్యాడర్ స్ట్రెంత్ ను అప్డేట్ చేసి ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు చెల్లించే విధంగా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ట్రెజరీ అధికారులతో సమన్వయం చేసుకొని ఎంటిఎస్ 2008,1998 ఉపాధ్యాయులకు తొందరగా వేతనాలు చెల్లించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, సహ అధ్యక్షులు జిహెచ్.బాబు, కోశాధికారి ఎం.సుధాకర్, జిల్లా కార్యదర్శి ఈ.నారాయణస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంవి.మారుతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు




మృతి చెందిన తల్లీఇద్దరు కూతుళ్లు (ఫైల్ ఫొటో)

క్షణికావేశం..!

ఇద్దరు కూతుళ్లతో సహా చెరువులో దూకి తల్లి ఆత్మహత్య

ఓ వివాహిత క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. కుటుంబంలో రేగిన మనస్పర్థలను పరిష్కరించుకోలేక చావే శరణ్యం అనుకుంది. తాను చనిపోతే తన ఇద్దరు కూతుళ్లను ఎవరూ పట్టించుకోరని భావించి వారినీ తన వెంట తీసుకెళ్లింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఇద్దరు కూతళ్లను చెరువులో తేసేసి తాను దూకి ఆత్మహత్య చేసుకుంది. శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో తల్లి సుగుణ(40), తన కూతుళ్లు దేవయాని(7), చెస్మిత(5)లు మృతిచెందారు.

వార్త మెయిన్‌లో


మృతి చెందిన భార్యాభర్తలు

విషాదం

◆ ట్రాక్టర్ బోల్తా ◆ భార్యాభర్తలు మృతి

ప్రజాశక్తి-బెలుగుప్ప

వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న భార్యాభర్తలను ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. వీరి ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో దంతులిద్దరూ ఘటనా స్థలంలోనే మరణించారు. బెలుగుప్ప మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... నక్కలపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి(45), సువర్ణమ్మ(40) భార్యాభర్తలు. వీరిద్దరూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆదివారం ఉదయం వారి తోటలో వ్యవసాయ పనులు ముగించుకుని ట్రాక్టర్లో ఇంటికి బయల్దేరారు. ఈశ్వర్‌రెడ్డి ట్రాక్టర్ తోలుతుండగా భార్య ఆయన పక్కన కూర్చొంది. గ్రామ సమీపంలోని వంక వద్ద ఉన్న పెద్ద గుంతలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజిన్ కింద భార్యాభర్తలు ఇద్దరూ పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అటుగా వెళు న్న తోటి రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామకష్ణయ్య అక్కడికి చేరుకున్నారు. మతదేహాలను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైతు దంపతుల మృతి విషయం తెలుసుకున్న ఉరవకొండ నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం తరుపున కుటుంబానికి అండగా ఉంటామని మృతుల కుమారుడు, కుమార్తెకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల వైసిపి నాయకులు నక్కలపల్లి సర్పంచి రామిరెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, నక్కలపల్లి భాస్కర్ రెడ్డి, కరుణాకర్ ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం మండలంలోని భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీ సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక మండల కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి సత్యసాయి జిల్లా భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షులు రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. ఇసుక కొరతతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనులు లేకపోవటంతో కార్మికుల కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని వాపోయారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భవన నిర్మాణరంగ కార్మికులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల కమిటీ సభ్యులు రంగారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఆంజనేయులు, శీను తదితరులు పాల్గొన్నారు



మూతపడిన శుద్ధజల కేంద్రం

శుద్ధజల కేంద్రం బంద్

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని చందకచెర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ శుద్ధజల కేంద్రం మూతపడింది. దీంతో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2014లో టిడిపి హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ శుద్ధ జల కేంద్రం ద్వారా రూ.2కే 20 లీటర్ల శుద్ధ జలాన్ని ప్రజలకు అందించేవారు. ప్రారంభంలో మిత్ర సంస్థ ఈ కేంద్రాన్ని నిర్వహించింది. తర్వాత ప్రభుత్వం నుంచి పంచాయతీలకు సక్రమంగా నిధులు అందకపోవడం, వచ్చిన నిధులను ఇతర వాటికి మళ్లించడంతో శుద్ధ జల కేంద్రం నిర్వహణ, మరమ్మతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ప్రజలు ప్రయివేట్ ట్యాంకర్ వద్ద రూ. 10 చెల్లించి శుద్ధ జలాన్ని కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది గ్రామ ప్రజలు వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. కొందరు కొళాయి నీటినే తాగుతున్నారు. ఇకనైనా అధికారులు శుద్ధజల కేంద్రాన్ని తెరిపించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా ఖత్తలపల్లి నుంచి ధర్మవరానికి వెళ్లే రహదారిపై తహశీల్దార్ కార్యాలయం సమీపంలో గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇక్కడ పలువురు ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలయ్యారు. అయినా ఆర్ అండ్ అధికారులు పట్టించుకోవడంలేదు. మండల అధికారులు అందరూ ఈ గుంతలు చూసుకుంటూ వెలుతున్నారే తప్ప ఎవరూ పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. శనివారం రాత్రి ద్విచక్రవాహనదారుడు ధర్మవరం వెలుతూ ఇక్కడ గుంతలు గమనించకపోవడంతో ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో అతనితల్లి గంగలక్ష్మీ తీవ్రంగా గాయపడి అనంతపురంలోని ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. తహశీల్దార్ కార్యాలయం వద్దకు రాగానే గుంతలోకి ద్విచక్రవాహనాలు దిగాయంటే ప్రమాదానికి గురి కావాల్సిందే. పగలు అయితే గుంతలు గమనించి చాలా మంది తప్పించుకుంటూ వెళుతున్నారు. రాత్రి సమయాల్లో ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌కు కనిపించకపోవడం, వేగంగా వస్తూ గమనించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



గుంతలు పడిన రహదారి



సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ఇళ్లపట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం : టిడిపి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల దాటిన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో కానీ, గృహాలు నిర్మించడంలో పూర్తిగా విఫలమైందని టిడిపి నాయకులు విమర్శించారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూకోట్లాది రూపాయలు ఖర్చు చేసి 80 శాతం టిట్కో ఇల్లు టిడిపి ప్రభుత్వం నిర్మిస్తే మిగతా 20 శాతం పనులు కూడా చేపట్టని చేతగాని ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని విమర్శించారు. ఈ ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసిందని, ఎక్కడ చూసినా ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాలే రాజ్యమేలుతున్నాయన్నారు. రాష్ట్రంలో 25 లక్షల ఇళ్ళు నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడమే తప్ప నిర్మించింది ఏమీ లేదన్నారు. ఇప్పటికైనా నిరుపేదలకు ఇళ్ల నిర్మించి పేదల సొంతింటి కల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి మహమ్మద్ రఫీ, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఎస్సీ సెల్ నాయకుడు మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ మృతి

పరిగి : అనారోగ్య కారణం వల్ల తరచూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ నయం కాకపోవడంతో మనస్థాపానికి గురైన మహిళ పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మండలంలోని పెద్దరెడ్డిపల్లి కాలనీకి చెందిన విజయమ్మ తరచూ కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది దీంతో ఆమె భర్త అశ్వర్థనారాయణ పలుచోట్ల చికిత్స చేయించాడు. వైద్యం అందించినప్పటికీ ఫలితం లేకపోవడంతో జూన్ 30 తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. దీంతో స్థానికులు గుర్తించి హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యుల సూచనల మేరకు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ముదిగుబ్బ : మండలంలోకి కృష్ణాపురం క్రాస్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. ఆటోను లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదు మందికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 సాయంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు

ప్రమాదంలో విద్యార్థినులకు గాయాలు

చిలమత్తూరు : మండల పరిధిలోని హిందూపురం ప్రధాన రహదారి మరవకొత్తపల్లి బీసి కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కెజిబివి విద్యార్థులు గాయపడ్డారు. కస్తూరిబా పాఠశాలలో పదవతరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు వైష్ణవి, సిరిప్రియ ఆదివారం కావడంతో స్కూటీలో కొడికొండ చెక్‌పోస్టు వద్దకు వచ్చారు. ఈ నేపథ్యంలో వారి స్కూటీ అదుపుతప్పి బోల్తా పడటంతో గాయపాలయ్యారు. కెజిబివి నుంచి విద్యార్థినులు బయటకు ఎలా వచ్చారు.. ? సెలవు రోజు కావటంతో ఇంటికి వెళ్లిన వారు ప్రమాదం బారిన పడ్డారా.. లేక పాఠశాల నుండి ఏదైన పనిమీద బయటకు పంపారా అన్నది తెలియాల్సుంది. విద్యార్థునులకు బలమైన గాయాలు కావటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని కదిరి రోడ్ గల జగనన్న లేఅవుట్ సమీపాన గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న సిఐకంబగిరి రాముడు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 30 సంవత్సరాల ఉండొచ్చని భావించారు. శరీరం కుళ్లిపోవడాన్నిబట్టి చూస్తే యువకుడు ఐదు రోజుల క్రితం మతి చెంది ఉండవచ్చు అని భావించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

ధర్మవరం టౌన్ : గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయాల్లో కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పుట్టపర్తి రహదారి పక్కన ఉన్న షిర్డీసాయిబాబా ఆలయంలో ఉదయం 8గంటల నుండి రాత్రి 8గం టల వరకు పాదదర్శనం,11 గంటలకు అన్నదానం నిర్వహించడం జరుగుతుందని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేతిరెడ్డివెంకటరామిరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ హాజరవుతున్నారన్నారు. అదేవిధంగా కొత్తపేట షిర్డీసాయిబాబా ఆలయం, సిద్దయ్యగుట షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మడకశిర : పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. షిరిడి సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడ శుద్ధ చతుర్దశి ఆదివారం సామూహిక షిరిడి సాయి సత్య వ్రతాలు కంటి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీరంగం శ్రీనివాస్ నేతత్వంలో నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

సామాజిక తనిఖీపై అవగాహన

నల్లచెరువు : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో2022-23 సంవత్సరం లోజరిగిన ఉపాధి పనులు పైనా 17వ విడత సామాజిక తనిఖీపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జోగన్నపేట, అగ్రహారం, నల్లచెరువు, గ్రామపంచాయతీల సచివాలయాల వద్ద ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శకుంతల, ఆయా గ్రామాల సర్పంచులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002 - 2003 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి తమ గురువులు లక్ష్మినరసయ్య, కృష్ణమూర్తి, ప్రమీలరాణి, రవీంద్రారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, సుదర్శన్ రెడ్డి, పూర్వ విద్యార్థులు భరత్ రెడ్డి, వేమనారాయణ, షాకీర్, లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

పెనుకొండ : డాక్టర్స్ డేను పురస్కరించుకుని పట్టణంలోని ఘనగిరి హైస్కూల్‌లో ఆదివారం సోసియల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ హ్యూమెన్ రైట్స్ ఆధ్వర్యంలో వాయిస్ ఆఫ్ విక్టిమ్స్ నేతృత్వంలో ఉచిత గుండెవైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

ఆలయాభివృద్ధికి విరాళం

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని గుంతపల్లిలో గల శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయ అభివృద్ధికి దాళలు విరాళం అందజేశారు. చెన్నే కొత్తపల్లి మండలం ఎర్రబల్లి గ్రామానికి చెందిన అనురాధ, శ్రీనివాసరెడ్డి దంపతులు తమ వంతుగా 50వేల రూపాయలు అందజేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టగుండ్లపల్లి సర్పంచి నర్సిరెడ్డి, ఎంపీటీసీ, అర్చకులు , ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టూటౌన్ సిగా శ్రీనివాసులు

హిందూపురం : హిందూపురం టూటౌన్ సిఐగా శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతు పట్టణ వ్యాప్తంగా శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ముఖ్యంగా రెండవ స్టేషన్ పరిధిలో ఎక్కువ మురుగువాడలు ఉన్నాయని, వాటిపై దృష్టి సారించి ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ

లేపాక్షి : మండలంలోని మానేపల్లిలో కాంగ్రెస్ మండల కన్వీనర్ రామాంజినేయులు ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. హిందూపురం నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆమానులా, యూనస్, జమీల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మనేపల్లి విద్యార్థులకు రామాంజినేయులు క్రికెట్ కిట్ అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఓబుల దేవర చెరువు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండకమర్ల సచివాలయం 2, నాయన కోట తండా, వీరప్ప గారి పల్లి, ఎద్దుల వాండ్లపల్లి గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులతో పాటు ఎంపిపి పర్వీన్‌బాను, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, మండల కన్వీనర్ రాజు నాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సర్పంచులు గోవిందు, నిస్సార్ అహమ్మద్, రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని గౌరాజు పల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మాల గుండ్ల శంకర్ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో కొంతమంది విద్యుత్తు లైను ప్రమాదకరంగా ఉందని ఈ లైన్లు మార్చాలని విన్నవించారు. అదేవిధంగా కొన్ని వీధులకు నీటి సౌకర్యం లేదని తెలియజేశారు. అనంతరం మరొక బీసీ కాలనీలో కూడా మిద్దెలపై లెవెన్ కె.వి లైన్ ఉన్నదని విన్నవించారు. దీంతో ఆయన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, మండల కన్వీనర్ తిమ్మయ్య, ఎంపీటీసీ వీరేష్, రాష్ట్ర స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ బి నారాయణ రెడ్డి, ఎం నారాయణరెడ్డి,మాజీ సర్పంచ్ ఈశ్వర్, అధికారులు తహశీల్దార్ అనంతాచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులతో మాట్లాడుతున్న పుట్టపర్తి, పెనుకొండ ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, శంకరనారాయణ



కాలనీవాసులతో మాట్లాడుతున్న కమిషనర్

సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష

హిందూపురం : అర్హులైన వారందరికీ వందశాతం సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సచివాలయాల ఉద్యోగులతో కలిసి 3వ వార్డు ఆర్‌టిసి కాలనీ, 5వ వార్డు ఆబాద్‌పేట తదితర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి ఈ నెల 4వ తేదీ నుంచి ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకం అమలు కోసం ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని, అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలోని కమ్మవారి పల్లి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాలెండర్లు ఆదివారం పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలోని ఎర్రయ్యగారి పల్లి, ఎముకలగుట్టపల్లి మరియు కమ్మవారిపల్లి గ్రామాలలో కమ్మవారి పల్లి సర్పంచి చాపట్ల మణి శివశంకర్ రెడ్డి, ఎంపీటీసీ సిరగం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు ఎస్ నారాయణ రెడ్డి, నరేష్ కుమార్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు జగన్మోహన్ రెడ్డి, రంగారెడ్డి, గృహసారథులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గడపగడపకు వెళ్లి ప్రజలకు అందిస్తున్నటువంటి 11 రకాల ఉచిత సేవలు గురించి వివరించే జగనన్న సురక్ష క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో రఘునాథ గుప్తా, ఇఒఆర్‌డి సుధాకర్, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైసిపి నాయకుడు మృతి

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో వైసిపి నాయకుడు సి లక్ష్మ నాయక్ (82) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదివారం పెడపల్లి తండాలోని లక్ష్మానాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడపల్లి తండాలో మంచి నాయకుడిని కోల్పోయామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెడపల్లి సర్పంచి మంగ్లీ బాయ్, ప్రముఖ పారిశ్రామికవేత్త భాస్కర్ నాయక్, వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాల్ నాయక్, ఎంపీపీ రమణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాధర్, ఎంపీటీసీ రవీంద్ర నాయక్, మహిళా నాయకురాలు కన్యాకుమారి, మురళి, మల్లికార్జున, బండ్ల మోహన, డీలర్ రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'జాబిలి'కి జాతీయ కవితా పురస్కారం

ప్రజాశక్తి -పెనుకొండ



జాబిలి చాంద్‌బాషా

జాబిలి చాంద్‌బాషా రచించిన కవితా సంపుటి 'మట్టిని ముద్దాడిన మనిషి'కి కొలకలూరి ఇనాక్ జాతీయ కవితా పురస్కారాన్ని సైమన్ ఫౌండేషన్ వారు ప్రకటించారు. ఈ పురస్కారం ఈ నెల 9న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ప్రదానం చేస్తారని ఆ సంస్థ కార్యదర్శి బిక్కికృష్ణ తెలిపారు. జాబిలి రొద్దం మండలంల కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. కవి, రచయిత, సామాజిక కార్యకర్తగా తన రచనలు,సేవలద్వారా అటు విద్యార్థులను, ఇటు సమాజాన్ని జాగృతపరుస్తూ మెరుగైన సమాజం కోసం పాటుపడుతున్నాడు. మట్టిని ముద్దాడిన మనిషి కవతా సంపుటికి ఇదివరకే గిడుగు రామమూర్తి జాతీయ సాహితీ పురస్కారం, రాజా వాసిరెడ్డి స్మారక సాహితీ పురస్కారం అందుకున్నారు. గత 25 సంవత్సరాల నుంచి వేకువ సేవా సంస్థ, అనంతసాహిత్య అకాడమీ సంస్థలద్వారా అనేకమైన సాహితీ సామాజిక కార్యక్రమాలు నిర్వహించిన జాబిలికి కొలకలూరి ఇనాక్ జాతీయ సాహితీ పురస్కారం రావడం పట్ల సత్యసాయి జిల్లా రచయితల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

ఉచిత కంటివైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కర్నూలుకు చెందిన చక్ర ఆస్పత్రి వారిచే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు..ఈ శిబిరంలో కంటి చూపు మందగించిన 100 మందికి కంటి వైద్యనిపుణులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 40 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు వైకెశ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువర్స్ పౌండేషన్ అధ్యక్షుడుకార్యదర్శి సుంకు సుకుమార్. కోశాధికారి రాధాక్రిష్ణ, పీఆర్డీ జయరాం, సభ్యులు డాక్టర్ సుబ్బారావు, పోలాప్రభాకర్, చాంద్‌బాషా, రంగనాథ్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న కంటివైద్యనిపుణులు

డ్రిప్పు పరికరాలు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి - పెనుకొండ

పట్టణంలోని ఉద్యానవన శాఖ కార్యాలయం సమావేశ భవనంలో జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సుదర్శన్ అధ్యక్షతన మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్లకు, మైక్రో ఇరిగేషన్ అధికారులకు, మైక్రో ఇరిగేషన్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్లకు సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఒఎస్‌డి వైవిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లాలో 2022-2023 సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన 8000 హెక్టార్లకు గాను రైతులు నమోదు చేసుకున్న ప్రకారం 9347 హెక్టార్లు కాగా ఇంతవరకు అందరికీ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 224 హెక్టార్లకు మాత్రమే మెటీరియల్ పంపిణీ చేయవలసి ఉందని అలాగే ఇంకా 1160 హెక్టార్లకు డ్రిప్పును అమర్చవలసి ఉందని తెలిపారు. 2023 -24 సంవత్సరంలో సత్యసాయి జిల్లాకు పదివేల హెక్టార్లగా ప్రభుత్వం నిర్దేశించిందని వీటిని రైతులు రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఇంతవరకు కంపెనీలు వారిగా ఎంత డ్రిప్పు మంజూరు చేశారు ఎంతమందికి రైతులకు ఇంతవరకు అంద చేశారు రైతులకు డ్రిప్పు పంపిణి తర్వాత వాటిని ఎంతమంది రైతులకు వినియోగంలోకి తెచ్చారని కంపెనీల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు పెండింగ్ ఉన్న రైతులకు మంజూరైన డ్రిప్పులను ఎందుకు పంపిణీ చేయడం లేదని ఆరా తీశారు. ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న ఇంతవరకు రైతులకు డ్రిప్పు పంపిణీ చేయకపోవడం అమర్చకపోవడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం నిర్దేశించిన కాలానికి రైతులకు అందుబాటులో డ్రిప్పును సరిచేయాల్సిన అవసరం కంపెనీలకు ఇంజనీర్లకు అధికారులకు ఉందని అన్నారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్రిప్పు కంపెనీ జిల్లా కోఆర్డినేటర్లు ,ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ పరిధిలోని మొరుబాగల్ గ్రామంలో ఆదివారం హిమాలయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హిమాలయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహకులు సుధాకర్ మడకశిర పట్టణానికి చెందిన వారు. వృత్తిరీత్యా కడప పట్టణంలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. వారి ఆధ్వర్యంలో మోరుబాగల్ గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచి తిప్పేస్వామి అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ ఉభేదుల్లా వైద్య శిబిరంలో వచ్చినవారికి వైద్య చికిత్సలు అందించారు. కార్యక్రమంలో పిఆర్ఒలు వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులకు ఆపార్టీ నాయకులు క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఓటరుజాబితా వెరిఫికేషన్, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు పై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్. నరేంద్ర చౌదరి, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి రమేష్ బాబు, మండల ప్రధాన కార్యదర్శి కనుమ చంద్ర, కృష్ణమూర్తి యాదవ్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నల్లచెరువు : మండల పరిధిలోని రాట్నాలపల్లి కి చెందిన రవి నాయక్, కుమారుడు కార్తీక్ నాయక్ రోడ్డు ప్రమాదంలో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కదిరి శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతదేహం వద్ద నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తక్షణ సాయంగా రూ. 10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు భూమి కేటాయించాలి

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో హిందూ శ్మశాన వాటిక కోసం భూమిని కేటాయించాలని ఏపీ మెప్మా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సంద్భంగా ఏపీ మెప్మా అధ్యక్షులు హాజీ ఖాదర్‌బాషా మాట్లాడుతూ కదిరి పట్టణంలో 60 వేల సంఖ్యలో హిందూ సోదరులు నివసిస్తున్నారన్నారు. వీరిలో ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియల కోసం శ్మశానవాటిక లేక గుట్టల కింద చెరువు కట్టల కింద నీటి కాలువల పక్కన పరంపోకు స్థలాలలో సమాధి చేస్తున్నారన్నారు. ఒక్కొక్కసారి భారీ వర్షాల కారణంగా నీటి తాకిడికి సమాధులు, మృతదేహాలు కొట్టుకు పోతున్నాయని వాపోయారు. అధికారులు స్పందించి కనీసం 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర వాల్మీకి నాగ, ఉమేష్, శ్రీనివాసు, నరేష్, వెంకట్, మహేష్. జయరాములు తదితరులు పాల్గొన్నారు.